

భారీ వర్షాలు, వరదలపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

● ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రత్యేక అధికారి సర్ఫరాజ్ అహ్మద్



సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రత్యేక అధికారి సర్ఫరాజ్ అహ్మద్

కరీంనగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భారీ వర్షాలు, వరదలపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రత్యేక అధికారి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. ఆదివారం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో వివిధ శాఖల అధికారులతో జిల్లా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. భారీ వర్షాల వల్ల గండ్లుపడే అవకాశం ఉన్న చెరువులను ముందుగానే గుర్తించాలని అన్నారు. జలాశయాల నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర సమయాల్లో ఆపదమిత్ర వలంటీర్లను అందుబాటులో ఉంచాలన్నారు. యూరియా అక్రమ రవాణా జరగకకుండా, వ్యవసాయేతర అవసరాలకు వినియోగించకుండా నిరంతరం తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, గత సంవత్సరం డెంగీ, మలేరియా కేసులు ఎక్కడ ఎక్కువ నమోదయ్యాయో ఆ ఏరియాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో అన్ని రకాల మందుల నిల్వలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అడిషనల్ కలెక్టర్ అశ్వినీ తానాజీ వాకడే మాట్లాడుతూ వరద విపత్తుల సాయం కోసం కలెక్టరేట్, మున్సిపల్ కార్పొరేషన్ వద్ద 24 గంటలపాటు పనిచేసే కంట్రోల్‌రూంలను ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 7 డెంగ్యూ, 1 మలేరియా కేసులు నమోదయ్యాయని తెలిపారు. జిల్లాలో సాధారణ వర్షపాతం 3,39.1 కాగా 371.7 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదయిందని తెలిపారు. లోయర్ మానేరు జలాశయంలో 24 టీఎంసీల కెపాసిటీకి 6.49 టీఎంసీల నీటి నిల్వ ఉందని, వెయ్యి క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని తెలిపారు. జిల్లాలో కోళ్ల ఫారాలు, పరిశ్రమల్లో యూరియా అక్రమ వినియోగంపై తనిఖీలు కొనసాగుతున్నాయని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేశ్వర్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.



● మానేరుపై సందర్శకుల తాకిడి

● సెలవురోజు, చల్లటి వాతావరణంతో ఆసక్తి

కరీంనగర్ అర్బన్/తిమ్మాపూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని మానేరు జలాశయం కట్టపై సందర్శకుల తాకిడి ఒక్కసారిగా పెరిగింది. నాలుగు రోజులుగా వర్షాల మూలంగా కరీంనగర్ నగర ప్రజలు ఇళ్లకే పరిమితమవగా ఆదివారం వర్షాలకు కొంత విరామం ఇవ్వటంతో పాటు సెలవు రోజు కావటంతో సాయంత్రం సమయంలో నగరవాసులు ఒక్కసారిగా డ్యాంకట్టపైకి వాహనాలతో రావటంతో కిక్కిరిసిపోయింది. అయితే డ్యాంకట్టపైన గేట్ల సమీపంలోకి ఇంతకు ముందు వాహనాలను అనుమతించకుండా లేక్ అవుట్‌పోస్ట్ (మిగతా 8వపేజీలో)

తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీకాలనీ వద్ద డ్యాంలో సందర్శకులు



ఉజ్వల పార్క్ వద్ద డ్యాం కట్టపై సందర్శకులు

గ్రామ పాలన అధికారి, లైసెన్స్‌డ్ సర్వేయర్ల పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్

కరీంనగర్ అర్బన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం గ్రామ పాలనాధికారులు(జీపీవో) నియామక పరీక్ష, లైసెన్స్‌డ్ సర్వేయర్ల ఫైనల్ పరీక్ష నిర్వహించారు. జీపీవో పరీక్షకు 37 మంది దరఖాస్తు చేసుకోగా 30 మంది వీఆర్‌వో, వీఆర్‌ఏలు పరీక్ష రాశారు. అలాగే లైసెన్స్‌డు సర్వేయర్ పరీక్షకు 274 మందికి 233 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.

ఫుట్‌పాత్‌పై వ్యాపారం చేస్తే జరిమానా

● నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్



ఫుట్‌పాత్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఫుట్‌పాత్, రోడ్లు ఆక్రమించి వ్యాపారం చేస్తే మున్సిపల్ నిబంధనల ప్రకారం జరిమానా విధిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. ఆదివారం నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ప్రతిమ చౌరస్తా నుంచి ఆర్టీసీ బస్టాండ్ మీదుగా వన్‌టౌన్ చౌరస్తా వరకు ఫుట్‌పాత్, డ్రైనేజీ, రోడ్లు ఆక్రమణలను డీఆర్ఎఫ్, సానిటేషన్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన డ్రైనేజీ మూతను ఓపెన్ చేయించి కార్మికులు, సిబ్బందితో చెత్తను శుభ్రం చేయించారు. బస్టాండ్ సమీపంలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారం చేస్తున్న ఫుట్‌పాత్ ఆక్రమణలను డీఆర్ఎఫ్ సిబ్బంది, టౌన్ ప్లానింగ్ విభాగం సిబ్బందితో తొలగించి ఆక్రమణల పట్ల వ్యాపారులను హెచ్చరించారు. బస్టాండ్ ఎదురుగా ఉన్న మయూర హోటల్ పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా కనిపించడంతో పరిశీలించారు. అనంతరం హోటల్‌లో కిచెన్, డైనింగ్‌హాల్‌ను తనిఖీ చేసి పూర్తిగా అపరిశుభ్రంగా హోటల్ నిర్వహిస్తుండంపై ఆగ్రహం వ్యక్తం చేసి 25 వేల రూపాయల జరిమానా విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారులు చేయరాదని తెలిపారు. నగరవ్యాప్తంగా డీఆర్ఎఫ్ సిబ్బంది, టౌన్ ప్లానింగ్ అధికారులు పర్యవేక్షణ చేసి ఎక్కడ ఆక్రమణలు ఉన్నా తొలగించాలని, ప్రధానంగా హోటల్, రెస్టారెంట్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, టిఫిన్ సెంటర్ల వ్యాపారులు చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా తినుబండారాలు తయారుచేసే కిచెన్, డైనింగ్‌హాల్‌లో శుభ్రతను పాటించాలని అన్నారు. కార్యక్రమంలో సానిటేషన్, టౌన్ ప్లానింగ్ అధికారులు, హెల్త్ ఆఫీసర్, డీఆర్ఎఫ్, సానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాలకు మోదీ ప్రాధాన్యం

● బీసీ ముసుగులో ముస్లిం రిజర్వేషన్ల అమలుకు కుట్ర

● కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండిసంజయ్ కుమార్

సుభాష్‌నగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విద్య, వైద్యరంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఆదివారం కరీంనగర్ జిల్లా జనరల్ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రిటికల్ కేర్ సెంటర్‌ను మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ మేయర్ సునీల్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. కరీంనగర్ జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ మిషన్ కింద 23 కోట్ల 75లక్షల రూపాయల కేంద్ర నిధులతో క్రిటికల్ కేర్ బ్లాక్ నూతన భవనం నిర్మించామని తెలిపారు. ఈ భవనాన్ని ఈ రోజు ప్రారంభించుకోవడం సంతోషకరమన్నారు. ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది నియామకం, మెయింటనెన్స్ అంతా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉంటుందన్నారు. వాటిని వెంటనే సమకూర్చి క్రిటికల్ కేర్ బ్లాక్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. మోదీ ప్రభుత్వం విద్యారంగానికి ఈ ఒక్క యేడాది 1లక్ష 28వేల 650కోట్ల రూపాయలు కేటాయించిందని తెలిపారు. వైద్య రంగానికి లక్ష కోట్లు పెరిగిందని అన్నారు. ఎంబీబీఎస్‌తో పాటు పీజీ సీట్లు పెద్ద సంఖ్యలో పెంచారని అన్నారు.



క్రిటికల్ కేర్ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, పాల్గొన్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

● 42శాతం రిజర్వేషన్లు బీసీలకు అమలు చేయాలి

బీసీ డిక్లరేషన్ ముసుగులో ముస్లింలకు ఎక్కువ రిజర్వేషన్లు అమలు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపన్నుతోందని, ఇది ముమ్మాటికీ ముస్లిం డిక్లరేషన్ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం డిక్లరేషన్ బిల్లును తీసుకువచ్చిందన్నారు. రాష్ట్రంలో 27శాతం రిజర్వేషన్లు బీసీలకు అమలవుతున్నాయని, అదనంగా బీసీలకు 5శాతం రిజర్వేషన్లు ఇస్తూ ఆ ముసుగులో ముస్లింలకు 10శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నారని అన్నారు. అట్లాంటప్పుడు అది బీసీ డిక్లరేషన్ ఎట్లా అవుతుందని ప్రశ్నించారు. బీసీ జాబితా నుంచి ముస్లింలను తొలగించే దాకా ఆ బిల్లును అడ్డుకుని తీరుతామని స్పష్టం చేశారు. ముస్లింలను తొలగించి 42శాతం రిజర్వేషన్లను పూర్తిగా బీసీలకు అమలు చేస్తేనే సంపూర్ణ మద్దతిచ్చి బిల్లు ఆమో దానికి కేంద్రాన్ని ఒప్పిస్తామని అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ముస్లిం ఓట్ల కోసమే పెద్దమ్మ గుడి కూల్చి వేశారని ఆరోపించారు. దీన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. హిందువులంటే అంత చులకనగా కనిపిస్తున్నారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడిని కూల్చివేసిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

● బీజేపీ సింగిల్‌గానే ఎన్నికల్లో పోటీ

తెలంగాణలో బీజేపీ స్వతహాగా పోటీ చేయబోతుందని అన్నారు. ప్రజలంతా బీజేపీ వైపు ఉన్నారని, అందరికీ అధికారం ఇచ్చారు. ఈ సారి బీజేపీకి అవకాశం ఇద్దామని ప్రజలంతా భావిస్తు న్నారని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల్లో బీజేపీ అత్యధిక స్థానాలు గెలవబోతోందని అన్నారు. బీజే పీలో చాలా మంది రాష్ట్ర అధ్యక్షులుగా చేసిన నాతో సహా చాలా మంది బీసీలు ఉన్నారని, ప్రధాన మంత్రి మోదీ బీసీ, మోదీ కెబినెట్‌లో 27మంది బీసీలున్నా రని తెలిపారు. మరి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎంత మంది బీసీలు ఉన్నారో ఎంత మంది బీసీలను ముఖ్యమంత్రులను చేశారో చెప్పే దమ్ముందా అని ప్రశ్నించారు. మోదీ కన్వర్టెడ్ బీసీ అంటున్న కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ ఏ కులం వ్యక్తి అని చెప్పాలన్నారు. అవినీతి సొమ్ముతో కేటీఆర్‌కు అహం ఎక్కువైందని మండిపడ్డారు. ప్రధానిని బీజేపీ నేతలు దూషిస్తే ఊరుకునేది లేదని, మా కార్యకర్తలే నీ సంగతి చూస్తారని హెచ్చరించారు. ఇష్టానుసారంగా సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తానంటే ఒప్పుకునే ప్రసక్తి లేదు, తాను హోంశాఖ సహాయ మంత్రిని అయినా కేటీఆర్ హద్దులు దాటి వ్యవహరిస్తున్నారని అన్నారు.

ఆసిఫ్‌నగర్‌కు వరద నీరు

● ఇబ్బందులు పడుతున్న ప్రజలు

● శాశ్వత పరిష్కారం చూపాలని వేడుకోలు

భగత్‌నగర్, జూలై 27(ఆంధ్రజ్యోతి): డ్రైనేజీల గుండా లోతట్టు ప్రాంతాలకు వెళ్లాల్సిన వరద నీరు ఆసిఫ్‌నగర్ గ్రామంలోకి చేరి పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కరీంనగర్-సిరిసిల్ల ప్రధాన రహదారి నిర్మాణంలో భా గంగా డ్రైనేజీల నిర్మాణం చేపట్టారు. డ్రైనే జీ నిర్మాణం కొంత మేరకే చేసి వదిలివేయడంతో వర్షం నీరు కరీంనగర్-సిరిసిల్ల ప్రధాన రహ దారిపై చేరి వాహనదారులకు ఇబ్బందులు తలెత్తాయి. దీంతో వరద నీటిని ఆసిఫ్‌నగర్ వైపునకు కచ్చా డ్రైనేజీని తీసి నీటిని మళ్లించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరద నీరంతా గ్రామంలోకి చేరడంతో ఇబ్బం దులు పడుతున్నారు. రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీటిని అధికారులు గ్రామం లోకి మళ్లించడంతోనే గ్రామంలోకి వెళ్లే రహదారి చెరువును తలపిస్తున్నది. అధికారులు స్పందించి వరద నీరు వెళ్లేందుకు శాశ్వత పరిష్కారం చూపించాలని ప్రజలు కోరుతున్నారు.



వరదనీటితో వాహనదారుల ఇబ్బందులు



రోడ్డుపైకి వచ్చిన వరదనీరు

21 మంది హెడ్‌కానిస్టేబుళ్ల బదిలీ

కరీంనగర్ క్రైం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కమిషనరేట్‌లో 21 మంది హెడ్‌కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. కమిషనరేట్‌లోని వివిధ పోలీసు ఠాణాలు, టాస్క్‌ఫోర్స్, వెకెన్సీ రిజర్వు(వీఆర్)లో విధులు నిర్వహిస్తున్న 21 మంది హెడ్‌కానిస్టేబుళ్లను వివిధ పోలీసు ఠాణాలు, సీఎస్‌బీకి అటాచ్‌మెంట్‌గా బదిలీ చేశారు.

గ్రామీణ మహిళల కోసం ‘ఉల్లాస్’

● స్వయం సహాయక సంఘాల సభ్యుల అక్షరాస్యతకు శ్రీకారం

● ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో చేరిక

7

కరీంనగర్ కార్పొరేషన్‌పై ఎంఐఎం జెండా ఎగురవేస్తాం

కరీంనగర్ రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల, మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బలోపేతం చేస్తామని, ముఖ్యంగా కరీంనగర్ నగరపాలక సంస్థపై జెండా ఎగురవేస్తా మని ఎంఐఎం పార్టీ ఉమ్మడి కరీం నగర్ జిల్లా ఇంచార్జి సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ అన్నారు. ఆదివారం బొమ్మకల్ సలఫీనగర్‌లో 34వ డివిజన్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిం చారు. 34వ డివిజన్ ఇన్‌చార్జి ఖాజా మజహరొద్దీన్ ఆధ్వర్యంలో ఎంఐఎం పార్టీలో చేరిన యువకులకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలే లక్ష్యంగా పార్టీని బలోపేతం చేయాలని కోరారు. స్థానిక సంస్థల, మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎం ఏ రాజకీయ పార్టీతో పొత్తు పెట్టుకోకుండా ఎక్కువ స్థానాల్లో పోటీ చేయబోతుందని ప్రకటించారు. కరీంనగర్‌లో 25 డివిజన్లలో గెలిచి తాము సత్తా చాటుతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బర్కత్ అలీ, హఫీజ్ మొయిజుద్దీన్ ఖాద్రి యూసుఫ్, అతిన, ఇబ్రహీం, అఖీల్ ఫిరోజ్, శర్ఫుద్దీన్, అజర్ దబీర్, కాజమ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంఐఎం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి గులాం అహ్మద్ హుస్సేన్



కరీంనగర్ సెల్: 99854 11278, 99859 21353, 97036 18691, 99854 10640, పెద్దపల్లి సెల్: 95509 00238

జగిత్యాల సెల్: 99854 11262 , మెట్‌పల్లి సెల్: 70131 42966,

వేములవాడ, సిరిసిల్ల సెల్: 99854 11063

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

హోటల్ అమ్మబడును

★ కరీంనగర్ టౌన్‌లో, మేయిన్ సెంటర్‌లోని రన్నింగ్‌లో ఉన్న ప్రముఖ హోటల్ (టిఫిన్స్, లంచ్ & రెస్టారెంట్) లీజ్ / సేల్‌కు కలదు. సంప్ర : సెల్ : 90595 49808

AJK- 17037

BUSINESS OFFER

నెట్వర్క్ లీడర్స్‌కు మంచి అవకాశం. నూతనంగా స్టార్ట్ ఐన మల్టిపుల్ ప్రోడక్ట్ బెసుడ్ కంపెనీ లో టీమ్‌వర్క్ ద్వారా డబ్బులు సంపాదించుకునే అవకాశం. సెల్ : 9959974159.

AJM-13780

WANTED

★ హన్మకొండ స్వచ్ఛంద సంస్థలో హాస్టల్ నందు వంట చేయుటకు భార్యాభర్తలు కావలెను. ఉచిత వసతి+భోజనం మరియు జీతం కల్పించబడును. సంప్ర: 8074465703, 9849038142

AJW-420

CHANGE OF NAME

★ I, "BADDAM RAJA REDDY S/O. BADDAM SANJIVA REDDY, R/O. H.NO: 5-05, CHIGURUMAMIDI, KARIMNAGAR. I HAVE CHANGED MY NAME AS"BADDAM RAJI REDDY" S/O. BADDAM SANJIVA REDDY

AJK-17059

CHANGE OF NAME

★ I,"BADDAM DEVENDER S/O. BADDAM RAJI REDDY, R/O.H.NO: 5-2, CHIGURUMAMIDI, KARIMNAGAR. I HAVE CHANGED MY NAME AS"BADDAM DEVENDER REDDY" S/O. BADDAM RAJI REDDY

AJK-17059

3+2 స్కీం కలదు

పాస్‌పోర్ట్ పోయినది

★ గడ్డం తిరుపతి రెడ్డి S/o. తండ్రి: జనార్దన్ రెడ్డి, నివాసం: ఇ.నెం. 8-3-245/D/C/6/2, వెంకటేశ్వర కాలనీ, రోడ్ నెం. 4, భగత్‌నగర్, కరీంనగర్. తేది: 20-07-2025 రోజున నేను మా ఇంటి నుండి కరీంనగర్ బస్టాండ్ వైపు వెలుతున్న ప్రయాణంలో నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ పోయినది. పాస్‌పోర్ట్ నెం. L5376625 దొరికినవారు అందజేయగలరు. సెల్: 7989116619

AJK-17058

CHANGE OF NAME

★ I, "GANEVENI NARSINGAM"S/O. GANEVENI LASMAIAH (Old Name), R/O. H.NO: 4-63, ABBAPUR, KOTHUR, PEDDAPALLI. I HAVE CHANGED SURNAME AS "GANAVENI NARSINGAM" S/O. GANAVENI LASMAIAH (New Name)

AJK-17059

CHANGE OF NAME

★ I," SURAM MAHENDER" S/O. SURAM SANJEEVAREDDY, R/O. H.NO: 5-63/23, PARLAPALLY, THIMMAPUR, KARIMNAGAR. I HAVE CHANGED MY NAME AS"SURAM MAHENDER REDDY" S/O. SURAM SANJEEVA REDDY.

AJK-17059

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.

పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి

కరీంనగర్ :- సెల్ : 9703618691, 9985410640

జగిత్యాల, మెట్‌పల్లి :- సెల్ : 99854 11262

వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063

పెద్దపల్లి :- 95509 00238

మట్టి టిప్పర్ పట్టివేత

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట), జూలై 27 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను ఎల్లారెడ్డిపేట పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఎస్ఐ మోతీరాం తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని కోరుట్లపేట నుంచి బొప్పాపూర్ వైపు వస్తున్న మట్టి టిప్పర్‌ను పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు ఆపి డ్రైవర్ వినోద్‌ను అనుమతిపత్రాలు చూపాలని కోరడంతో లేవని తెలిపాడు. దీంతో మట్టి లోడుతో ఉన్న టిప్పర్‌ను పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు యజమాని సురేందర్, డ్రైవర్ వినోద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మోతిరాం తెలిపారు.

మూడు కేజ్‌వీల్స్ ట్రాక్టర్ల పట్టివేత

కాల్వశ్రీరాంపూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కేజ్‌వీల్స్‌తో రోడ్డుపై నడుపుతున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. ఆదివారం పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా మండలంలోని మీర్జంపేట గ్రామానికిచెందిన కటకం లక్ష్మణ్ రావు, మల్యాల గ్రామానికి చెందిన స్వప్న, సిద్దార్థ ట్రాక్టర్‌లను పట్టుకున్నామని తెలిపారు. ట్రాక్టర్లయాజమానులు కేజ్‌వీల్స్‌తో రోడ్డుపై ప్రయాణం చేస్తే చట్టపరమైన చర్యలుతీసుకుంటామని ఎస్ఐ పేర్కొన్నారు.



మావోయిస్టు అమరవీరుల వారోత్సవాలు

నేటి నుంచి ఆగస్టు 3వరకు నిర్వహణ

మంథని, జూలై 27: భూమి కోసం.. భుక్తి కోసం.. పీడిత ప్రజల విముక్తి కోసం.. సీపీఐ మావోయిస్టు దశాబ్ధాలుగా ప్రజాపోరు సాగిస్తోంది. ప్రజా గెరిల్లా యుద్ధంలో నెలకొరిగిన వీరులను స్మరించుకునేందుకు సీపీఐ మావోయిస్టులు యేటా జూలై 28 నుంచి ఆగస్టు 3 వరకు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను నిర్వహిస్తోంది. మీ త్యాగ ఫలం.. మీ కర్మ ఫలం.. వృథాకాదు.. ఎర్ర జెండా సాక్షిగా.. అంటూ నివాళులర్పించనుంది.

● చారుమజుందార్, కన్హాయ్ ఛటర్జీల స్మృతిలో..

విప్లవ పితామహుడు చారుమజుందార్ పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లా సిలుగూరిలోని నక్సల్బరి గ్రామంలో విప్లవోద్యమాలకు బీజాలు నాటి 1972 జూలై 28న అమరుడయ్యారు. 1982 జూలై 18న మరో విప్లవ నాయకుడు కన్హాయ్ ఛటర్జీ పోరుబాటలో మృత్యువాడపడ్డారు. వీరిద్దరి స్మృతిలో అమరవీరుల త్యాగాలను స్మరించుకునేందుకు సంస్మరణ వారోత్సవాలను నిర్వహిస్తోంది.



పోరాటాల వారసత్వాన్ని ఉమ్మడి కరీంనగర్ జిల్లా పునికి పుచ్చుకుంది. మంథని, పెద్దపల్లి, రామగుండం, జగిత్యాల, సిరిసిల్ల, హుస్నాబాద్, హుజురాబాద్, జమ్మికుంట, కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతాల్లో దొరలు, భూస్వాములు, పటేల్, పట్వారీల అరాచకాలపై ప్రజలు తిరగబడ్డారు. గడీలపై దండ యాత్రలు చేయడంతోపాటు జగిత్యాల జైత్రయాత్రతో పోరాటాల ఖిల్లా చరిత్రకెక్కింది. కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలకు సవాల్ విసురుతున్న సీపీఐ మావోయిస్టు పార్టీకి సెంట్రల్ కమిటీ కార్యదర్శిగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ముప్పాల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి దశాబ్దాల కాలంగా ప్రాతినిధ్యం వహించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా (ప్రస్తుత జగిత్యాల) బీర్‌పూర్ గణపతి స్వగ్రామం. మూడున్నర దశాబ్దాలకుగా పైగా సాగుతున్న విప్లవోద్యమంలో ఉమ్మడి జిల్లాకు చెందిన అనేక మంది విప్లవవీరులు నెలకొరిగారు.

● అడవులకే పరిమితమైన వారోత్సవాలు..

దండకారణ్యంలో నిరంతరం పోలీసు బలగాలు దాడులు.. వరుస ఎన్‌కౌంటర్.. ప్రాణ నష్టం, పెరిగిన ఇన్‌ఫార్మర్, అత్యాధునిక నెట్‌వర్క్.. రిక్రూట్‌మెంట్‌కు ఆదరణ కరువుకావడంతో కొద్ది సంవత్సరాలుగా మావోయిస్టు కార్యకలపాలను కేవలం అటవీ ప్రాంతాలకే పరిమితం చేశాయి. యేటా తమకు పట్టున్న మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని అడవుల్లోనే మావోయిస్టుల అమర వీరులకు తాత్కాలికంగా స్థూపాలు నిర్మించి నివాళులర్పిస్తున్నారు.

● అన్నల అలజడి లేని అడవులు..

దశాబ్దంన్నర కాలంగా జిలాల్లో మావోయిస్టు దళాల కదలికలు పూర్తిగా కనుమరుగయ్యాయి. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతాలకు మకాం మార్చారు. తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల్లో సైతం మావోయిస్టుల కదలికలు కానరాలేదు. దీంతో గతంలో విధ్వంస, హింసాత్మక సంఘటనలతో అట్టుడికిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఫ్రీజోన్‌గా మారింది.

● త్యాగాల చిహ్నాలుగా అమరుల స్థూపాలు..



బేగంపేటలో మావోయిస్టు అమరవీరుల స్మారక స్థూపం

అమరుల త్యాగాలకు చిహ్నంగా హుస్నాబాద్‌లో ఆసియాలో రెండో అతి పెద్ద స్థూపం, కమాన్‌పూర్ మండలం బేగంపేట, భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండల కేంద్రంతోపాటు మరి కొన్ని చోట్ల స్మారక స్థూపాలను పీపుల్స్‌వార్ (మావోయిస్టు) నాయకత్వాలు నిర్మించాయి. హుస్నాబాద్ స్థూపాన్ని గుర్తు తెలియని వ్యక్తులు పేల్చివేయగా ప్రస్తుతం బేగంపేట, మహాముత్తారం స్థూపాలు అమరుల త్యాగాలకు చిహ్నంగా దర్శనమిస్తున్నాయి.

అన్నవరం దేవేందర్‌కు సినారె పురస్కారం



పురస్కారం అందుకుంటున్న అన్నవరం దేవేందర్

కరీంనగర్ కల్చరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్‌కు చెందిన కవి అన్నవరం దేవేందర్ ఆదివారం భువనగిరిలో డాక్టర్ సి.నారాయణరెడ్డి 94వ జయంతి సందర్భంగా యాదాద్రి భువనగిరి రచయితల సంఘం ఆధ్వర్యంలో సినారె సాహిత్య పురస్కారం అందుకున్నారు. తెలంగాణ హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ కూనూరు లక్ష్మణకుమార్ పురస్కారం ప్రదానం చేశారు. పాత పది జిల్లాల నుంచి ఎంపికైన కరీంనగర్ నుంచి అన్నవరం ఒకరు. లక్ష్మణకుమార్ మాట్లాడుతూ కవులు ప్రజలు, సమాజం, దేశం కేంద్రంగా రచనలు చేయాలని దేవులపల్లి రామానుజరావు వ్యాఖ్యలను ఉటంకించారు. భాషాభివృద్ధి కోసం సాహిత్యాన్ని అధ్యయనం చేయాలని అన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమి పూర్వ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి, డాక్టర్ పోరెడ్డి రంగయ్య, సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి జె.చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

50 ఏళ్ల జ్ఞాపకం

● మానకొండూర్‌లో అ'పూర్వ' సమ్మేళనం



మానకొండూర్‌లో ఒకచోట కలుసుకున్న 1975-76బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు

మానకొండూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : ఐదు దశాబ్దాల క్రితం ఒకే పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు మళ్లీ ఒక్క చోటికి చేరారు. చెరిగిపోని తమ స్నేహాన్ని మళ్లీ గుర్తుకు తెచ్చుకున్నారు. మానకొండూర్ జడ్పీ ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో చదివిన 1975-76వ బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు మండలకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 50 ఏళ్ల అనంతరం మళ్లీ కలుసుకోవడంతో ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్న నాటి చిలిపి చేష్టలు, అల్లరి పనులతోపాటు ఆనాటి అనుభూతులు పంచుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. అంతకుముందు మృతిచెందిన గురువులు, తోటి విద్యార్థుల ఆత్మశాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు.

యువకుడి బలవన్మరణం

వీణవంక, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్బాక గ్రామానికి చెందిన ఊట్ల పవన్‌కళ్యాణ్(25) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. పవన్‌కళ్యాణ్ టెంట్‌హౌజ్‌లో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ మధ్య పనికి సరిగా వెళ్లకుండా మద్యానికి బానిసై ఆర్థికంగా ఇబ్బందులుకు గురయ్యాడు. ఈక్రమంలో మనస్థాపానికి గురై ఇంట్లోని దూలానికి చీరతో ఉరివేసుకోని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు పవన్‌కల్యాణ్ తల్లి ఊట్ల రాజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

● 21 లక్షల విలువ చేసే గంజాయి స్వాధీనం

పెద్దపల్లి టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించి డీసీపీ కరుణాకర్ ఆదివారం వివరాలు వెల్లడించారు. జల్సాలకు అలవాటు పడి అత్యాశతో గంజాయికి బానిసైన వారికి రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసకున్నట్లు తెలిపారు. భూపాలపల్లి జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలం బసవరాజుపల్లెకు చెందిన అంగడి సాంబయ్య బిల్డింగ్ సీలింగ్ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. వచ్చే డబ్బులు అవసరాలకు, జల్సాలకు సరిపోక సులువుగా డబ్బు సంపాదించాలని ఒడిశాకు చెందిన రమేష్ సహాయంతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా నుంచి తక్కువ ధరకు గంజాయిని కొని ఆటో ఇంజన్ కింద భాగంలో ప్యాక్ చేసుకొని మంచిర్యాలలో అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 27 న నిందుతుడు ఆటోలో గంజాయి ప్యాకెట్లతో మంచిర్యాలకు వెళ్తుండగా పెద్దపల్లి శివారులో ప్లై ఓవర్ దగ్గర పోలీస్ ల తనిఖీలో పట్టుపడ్డాడు. రూ. 21 లక్షల విలువ చేసే 41.88 కిలోల గంజాయితోపాటు ఆటోను స్వాధీనం చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. గంజాయి అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని పట్టుకోవడంలో కృషి చేసిన సీఐ కె.ప్రవీణ్ కుమార్, ఎస్ఐలు లక్ష్మణ్ రావు, నరేష్, కోటేశ్వర్, హెడ్ కానిస్టేబుల్లు అనంతరెడ్డి, స్వామి కానిస్టేబుల్స్ ప్రభాకర్, సతీష్, రాజు అనిల్ కుమార్ లను పెద్దపల్లి డీసీపీ కరుణాకర్ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ

పొన్నం రవిచంద్రకు పైడి జయరాజ్ స్మారక పురస్కారం

కరీంనగర్ కల్చరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన ఫిలిం క్రిటిక్ పొన్నం రవిచంద్ర ఆదివారం రవీంద్ర భారతిలో నిర్వహించిన కార్యక్రమంలో పైడి జయరాజ్ స్మారక పురస్కారాన్ని అందుకున్నారు. తెలం గాణ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేసే తెలంగాణ సన్మాన్-2025 పురస్కారాల్లో భాగంగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు కవులు, కళాకారులు అభినందనలు తెలిపారు.



అతిథులు, ఇతర పురస్కార గ్రహీతలతో పొన్నం రవిచంద్ర

చికిత్స పొందుతూ మున్సిపల్ కార్మికుడి మృతి



ప్రవీణ్ (ఫైల్)

పెద్దపల్లి టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రంగంపల్లి పదో వార్డుకు చెందిన మామిడిపల్లి ప్రవీణ్ సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన మామిడిపల్లి ప్రవీణ్ ఆర్థిక ఇబ్బందులతో మూడు రోజులక్రితం పురుగులమందు తాగి ఆత్మ హత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన బంధువులు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతు శనివారం ప్రవీణ్ మృతి చెందాడు. పోలీసులు కేసుదర్యాప్తు చేస్తున్నారు.

జనంలోకి కొండ చిలువలు

● హుజూరాబాద్, మానకొండూర్‌లలో ప్రత్యక్షం
● పట్టుకొని అటవీ ప్రాంతంలో వదిలేసిన ప్రజలు



హుజూరాబాద్‌లో, మానకొండూర్‌లో పట్టుకున్న కొండ చిలువలతో ప్రజలు

హుజూరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఆదివారం రాత్రి కొండచిలువ కలకలం రేపింది. సుమారు పది అడుగుల కొండచిలువ కనబడడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న పట్టణానికి చెందిన అబ్జల్ సంఘటన స్థలానికి చేరుకొని కొండచిలువను పట్టుకున్నారు. వెంటనే ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు అటవీ ప్రాంతంలో కొండ చిలువను వదిలేయాలని చెప్పడంతో గుట్టల్లో వదిలేశారు.

మానకొండూర్: మానకొండూర్‌లోని సాయిబాబా ఆలయం సమీపంలోని ఓఇంటిలో ఆదివారం రాత్రి గ్రామస్థులు కొండచిలువను పట్టుకున్నారు. ఇంటి ఆవరణలోని చెట్టుపై ఉన్న కొండచిలువను చూసిన ఇంటిలోని ఓ మహిళ కేకలు వేసింది. కాలనీవాసులు అక్కడికి చేరున్నారు. శ్రీనివాస్ అనే యువకుడు కొండ చిలువను పట్టుకొని ఈదులగట్టెపల్లిలో గల జాలగుట్ట వద్ద వదిలిపెట్టాడు. కొండచిలువ సుమారు ఆరు అడుగులకు పైనే ఉంటుందని శ్రీనివాస్ తెలిపారు.

యువకుడి అనుమానాస్పద మృతి



పొలంలో పడి ఉన్న మనోహర్ మృతదేహం

వీర్నపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిన యువకుడు జోగుల మనోహర్(35) వరి పొలంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెంది కనిపించిన ఘటన వీర్నపల్లి మండలం గర్జనపల్లి శివారులోని సీతారాం నాయక్ తండాలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. గర్జనపల్లికి చెందిన జోగుల చంద్రయ్య-నర్సవ్వల చిన్నకుమారుడు మహేష్‌పదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. తల్లి నర్సవ్వకు మతిస్థిమితం సరిగాలేక ఇంటి వద్దనే ఉంటూ జీవిస్తుంది. పెద్ద కుమారుడు మనోహర్ పరిస్థితి కూడా అదే విధంగా మతిస్థిమితం సరిగా లేక రోడ్ల వెంబడి తిరుగుతుంటాడు. తండ్రిచంద్రయ్య ఎకరం భూమిలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మనోహర్ శనివారం మధ్యాహ్నం ఇంట్లో భోజనం చేసి బయటకు వెళ్లాడు. రాత్రిఅయినా ఇంటికిరాకపోవడంతో తండ్రి చూసిచూసి పడుకున్నాడు. ఆదివారం తెల్లవారుజామున గ్రామశివారులోని పంట పొలంలో పడిఉన్నట్లు స్థానికులు సమాచారం అందించడంతో కుటుంబ సభ్యులతో కలిసి అక్కడికి వెళ్లి చూడగా బురదలో మృతిచెంది కనిపించాడు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ లక్ష్మణ్ సిబ్బందితో అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. తండ్రి చంద్రయ్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఉరి వేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

చొప్పదండి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంతోష్‌నగర్‌కు చెందిన ఎనగందుల లక్ష్మణ్(65) అనారోగ్య సమస్యలతో ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకు న్నాడు. పోలీసుల కథనంప్రకారం.. లక్ష్మణ్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తిచెంది శనివారం అర్ధరాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు మృతుడు లక్ష్మణ్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భట్రాజు యువతను ప్రోత్సహించడమే లక్ష్యం



రాష్ట్ర అధ్యక్షుడిని సన్మానిస్తున్న నాయకులు

సుభాష్‌నగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): భట్రాజు యువతను ప్రోత్సహించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర భట్రాజు యువజన సంఘం అధ్యక్షుడు కూరపాటి నరసింహరాజు అన్నారు. నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో రాష్ట్రయువజనసంఘం సర్వసభ్యసమావేశం నిర్వహించారు. భట్రాజు వివాహ పరిచయ వేదిక, స్పోర్ట్స్‌మీట్, మెగా జాబ్‌మేళా తదితర అంశాలపై చర్చించారు. కరీంనగర్ జిల్లా సంఘ భవనానికి సహాయ సహకారాలు అందించిన దాతలను, రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు కూరపాటి నరసింహరాజు, జిల్లాఅధ్యక్ష, కార్యదర్శులు కృష్ణకాంత్‌రాజు, ప్రశాంత్‌రాజును సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర భట్రాజు సంఘ నాయకులు విజయ రఘురామరాజు, ఎన్విడి ప్రసాద్‌రావజు, అనిల్ కుమార్‌రాజు, నవీన్ రాజు, విజయ్‌రాజు, కార్తీక్ రాజు పాల్గొన్నారు.

భక్తుల కొంగు బంగారం సోమేశ్వరస్వామి

● శ్రావణమాస పూజలకు ముస్తాబు
● సోమేశ్వర కొండపై సహజ సిద్ధ కోనేరు
● పర్యాటక కేంద్రంగా చేయాలంటున్న భక్తులు

మల్లాపూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కొలిచిన వారికి కొంగు బంగారంగా సముద్ర మట్టానికి 800 మీటర్ల ఎత్తులో మల్లాపూర్ మండల కేంద్రంలోని కొండపై శ్రీ కనక సోమేశ్వరస్వామి వెలిశారు. ప్రతీ ఏటా శ్రావణ, కార్తీక మాసాలతో పాటు శివరాత్రి పర్వదినాల్లో సోమేశ్వరాలయంతో పాటు కొండంతా భక్తులతో కిటకిటలాడుతుంది. గుట్టపైన గల సహజ సిద్ధ కోనేటిలో స్నానం చేస్తే నీరు ఔషదంగా పనిచేసి నొప్పులను మటమాయం చేస్తుందని పలువురు భక్తుల నమ్మకం. గర్భగుడిలోని స్వామికి భక్తులు అభిషేకం జరిపిన నీరు రాతి పొరలోంచి కొద్ది దూరం వెళ్లి ప్రత్యక్షం అవుతుంది. దీన్నే సోమ తీర్థం అంటూ భక్తులు పవిత్ర జలంగా స్వీకరిస్తున్నారు. కోనేటి నీటిని పొలంలో చల్లితే క్రిమి కీటకాలు దరిచేరవనే నమ్మకంతో రైతులు తీసుకెళ్తారు. భక్తులు కొండపైకి కాలి నడకన వెళ్లి స్వామిని దర్శించుకుంటారు. కొండ మీదకు వెళ్లేందుకు రవాణా మార్గం కల్పిస్తూ సోమేశ్వరాలయాన్ని పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయాలని పలువురు భక్తులు కోరుతున్నారు. ప్రతి ఏటా శ్రావణ మాసం సోమవారం భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకొని వరద పాయసాన్ని నైవేద్యంగా సమర్పిస్తారు. శివరాత్రి పర్వదినం మరుసటి రోజు స్వామి రథోత్సవం వైభవంగా జరుగుతుంది. కార్తీక పౌర్ణమిన రాత్రి జరిగే దీపోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు. ప్రతి సోమవారం కొండ కింద భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాదం ఏర్పాటు చేస్తారు.



మల్లాపూర్‌లోని కనకసోమేశ్వర ఆలయం కోనేరు వద్ద భక్తులు



మల్లాపూర్‌లోని కనకసోమేశ్వర ఆలయం



మల్లాపూర్‌లోని కనకసోమేశ్వర ఆలయంలో శివలింగం

కోరిన కోర్కెలు తీర్చే సోమేశ్వరుడు

-బండారి రమేష్, భక్తుడు, మల్లాపూర్

గుట్టపైన గల శ్రీకనక సోమేశ్వరస్వామి భక్తుల కోరిక కోర్కెలు తీర్చుతాడని నమ్మకం. మల్లాపూర్‌తో పాటు ఇతర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుంటారు. సోమవారం ఆలయంలో స్వామికి ప్రత్యేక అభిషేకం, అర్చనలు జరుపుతారు.

ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు పూర్తి

-సంఘ గంగరాజం, ఆలయ కమిటీ ఛైర్మన్

ప్రతి సోమవారంతో పాటు ఇతర పర్వదినాల్లో ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి సంవత్సరం శ్రావణ సోమవారం భక్తులు అధిక సంఖ్యలో స్వామికి వరద పాయసం పోస్తూ మొక్కులు చెల్లించుకుంటారు.

ప్రమాదవశాత్తు రైలు కింద పడి మహిళ మృతి

అంతర్గాం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండల పరిధిలోని కుందనపల్లి వద్ద ప్రమాదవశాత్తు రైలు కింద పడి సిరిశెట్టి లక్ష్మి(64) అనే మహిళ ఆదివారం మృతి చెందింది. రామగుండం రైల్వే జీఆర్‌పీ ఇన్‌చార్జ్ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం ఐటీసీ ఏరియా ఇందిరమ్మ కాలనీకి చెందిన లక్ష్మి కూతురు ఇంటికి వెళ్లేందుకు కుందనపల్లికి వస్తుంది. అదే సమయంలో రైల్వే గేటు వేసి ఉండటంతో గేటు కింది నుంచి పట్టాలు దాటుతుండగా ఎగువ వైపు పట్టాలపై వస్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందింది. రైల్వే జీఆర్‌పీ పోలీసులు శవ పంచనామా నిర్వహించి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలికి ముగ్గురు కూతుళ్లు, భర్త నారాయణ ఉన్నారు.

పెన్షన్ డబ్బులు పెంచి ఇవ్వాలి

● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

సిరిసిల్ల టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వికలాంగులు, వృద్ధులు, వితంతులు, ఒంటరిమహిళలు, నేత, గీతకార్మికులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెన్షన్ డబ్బులు పెంచి ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం వీహెచ్‌పీఎస్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఛలో హైదరాబాద్ మహాగర్జన జిల్లాస్థాయి సన్నాహక సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీనిఅమలు చేయడం లేదని ఆరోపించారు. రైతు రుణమాఫీ కోసం ప్రభుత్వం రూ.20వేలకోట్లు కేటాయించిందని, ఆ రూపాయలు అత్యంత పేదవాళ్లైన వికలాంగులు, వృద్ధులు, వితంతులు, ఒంటరి మహిళల పెన్షన్ డబ్బులేనని అన్నారు. కాళ్లు, చేతులు లేని పేదవారి డబ్బులు తీసి భూములు ఉన్నవారికి ఇస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వికలాంగులు, వృద్ధులు, వితంతులకు పెన్షన్ ఇవ్వాల్సిందేనని, చేతకాకుంటే రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. పెన్షన్ పెంచి ఇస్తావా రాజీనామా చేస్తావా తేల్చుకోవడం కోసమే ఆగస్టు 13న ఛలో హైదరాబాద్ మహాగర్జన నిర్వహిస్తున్నామన్నారు. భూములు ఉన్నవారికి ప్రభుత్వం రుణమాఫీలు చేస్తుంది, రైతు భరోసా ఇస్తుంది కానీ కాళ్లు చేతులు లేని వికలాంగులకు పెన్షన్ పెంచి ఇవ్వడానికి మనస్సు రావడం లేదని అన్నారు. తాడోపేడో తేల్చుకోవడం కోసం పోరాటం తప్ప వేరేమార్గం లేదని ఛలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చామన్నారు. వికలాంగులు, వృద్ధులు, వితంతులు, ఒంటరిమహిళలు, బీడీ,నేత,గీతకార్మికులు భారీగా తరలిరావాలన్నారు. సమావేశంలో వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు గోపాల్, జాతీయ నాయకులు రాంబాబు, నాగేశ్వర్, జిల్లా కన్వీనర్ శోభారాణి, కోకన్వీనర్లు రవీందర్, సురేష్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ బ్యాంక్ సర్వసభ్య సమావేశం వాయిదా

● గతంలో అవినీతిపై చర్యలు తీసుకుంటాం

● బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జి గడ్డం విలాస్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా సహకార అర్బన్ బ్యాంక్ సర్వసభ్య సమావేశం కోరం లేనందున వాయిదా పడినట్లు బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జి గడ్డం విలాస్‌రెడ్డి, సీఈవో శ్రీనివాస్ తెలిపారు. టీఎన్‌జీఓస్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం సర్వసభ్యసమావేశం ఏర్పాటు చేయగా బ్యాంక్ అధికారులు, 2007-2017 మధ్య ఉన్న కమిటీసభ్యులు కోరంలేదని వాయిదా వేయాలని కోరడంతో ఆగస్టు 3న నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా కరీంనగర్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి మాట్లాడుతూ 2007నుంచి 2017వరకు దాదాపు 20 సర్వసభ్య సమావేశాలు జరిగాయని, ఏ సమావేశంలోనూ 50నుంచి 100మంది సభ్యులు హాజరుకాలేదని అన్నారు. అయినప్పటికీ అప్పుడు అధికారులు, పాలకవర్గ సభ్యులు అనేక తీర్మానాలు చేశారన్నారు. కరీంనగర్ జిల్లా అర్బన్ బ్యాంక్‌కు 1,800మంది సభ్యులున్నట్లు రికార్డులున్నాయని, 2009లో కరీంనగర్‌లోని కళాభారతిలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తే 1,780మంది సభ్యులు హాజరైనట్లు తీర్మానంలో ఉందని అన్నారు. కళాభారతి సిట్టింగ్ కెపాసిటీ 250కాగా 1,780మంది సభ్యులను ఎక్కడ కూర్చోబెట్టారని ప్రశ్నించారు. దీనిపైన డీసీవోకు త్వరలో ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. బ్యాంక్ బైలాస్ ప్రకారం బ్యాంక్‌లో ఖాతాదారుడికే సభ్యత్వం ఇవ్వాల్సి ఉండగా అప్పటిపాలకవర్గం అడ్డగోలుగా సభ్యత్వాలు ఇచ్చిందని ఆరోపించారు. ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా సభ్యత్వం ఇచ్చి దానిని సమర్థించుకునేందుకు 2009లో బైలాను మార్చిందన్నారు. 2007నుంచి 2017వరకు పాలకకమిటీ అనేక అవతవకలకు పాల్పడిందని ఆరోపించారు. బ్యాంక్ మెంబర్‌షిప్ లెడ్జర్‌లో సభ్యులపేర్లను మార్చారని, ఇతరరికార్డులను మాయం చేశారని మండిపడ్డారు. నకిలీ బంగారంతో రుణం ఇచ్చి ఒక అధికారిని సస్పెండ్ చేశారని, ఆ రుణానికి సంబంధించిన డబ్బులు రికవరీ చేయలేదని, ఇన్సూరెన్స్‌కు దరఖాస్తు చేయలేదని అన్నారు. వీటిపై సహకార అధికారి లేఖ ద్వారా వారిపై చర్యకోసం నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఆ నోటీసులు తిరస్కరించిన వారిపై చర్య తీసుకునేందుకు సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేస్తే ఎక్కడ సభ్యత్వం కోల్పోతారోననే భయంతో సమావేశాన్ని వాయిదా వేయించారన్నారు. బ్యాంకుకుసంబంధించి అవినీతికి పాల్పడిన ప్రతీ ఒక్కరిపై చర్యలు తీసుకుంటామన్నారు.



చొప్పదండిలో స్వయం సహాయక బృందం సమావేశం

గ్రామీణ మహిళల కోసం

ఉల్లాస్



ఉల్లాస్ యాప్ లోగో

● స్వయం సహాయక సంఘాల సభ్యుల అక్షరాస్యతకు శ్రీకారం

● ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో చేరిక

చొప్పదండి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యతను రూపుమాపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉల్లాస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. చదువులేని మహిళలను గుర్తించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఉల్లాస్ యాప్‌ను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. మొదటి విడతలో స్వయం సహాయక సంఘంలో నిరక్షరాస్యులైన మహిళలను గుర్తించి వారిని అక్షరాస్యులను చేయాలని సంకల్పించి విద్య నేర్పే కార్యక్రమాన్ని ప్రారంభించారు. జాతీయ విద్యా విధానంలో భాగంగా కేంద్ర విద్య మంత్రిత్వశాఖ ఉల్లాస్(అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) యాప్‌ను తీసుకువచ్చింది.

● నిరక్షరాస్యుల గుర్తింపు

స్వయం సహాయక సంఘాల్లోని సభ్యుల్లో నిరక్షరాస్యుల గుర్తింపు ప్రక్రియను ప్రారంభించారు. చొప్పదండి మండలంలో 9,142 మంది మహిళలు స్వయం సహాయక గ్రూపుల్లో ఉన్నారు. ఇప్పటి వరకు 642 మంది నిరక్షరాస్యులను గుర్తించి 186 మందిని ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో చేర్పించారు. ఈ పథకం ద్వారా మహిళలకు రాయడం, చదవడం నేర్పిస్తారు. ప్రతి గ్రామానికి ఒక వలంటీర్‌ను నియమించారు. విద్యాశాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ, ఐకేపీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. నిరక్షరాస్యులను గుర్తించే ప్రక్రియ పూర్తికాగా అధికారులు ఉల్లాస్ యాప్‌లో నమోదు చేశారు. కార్యక్రమం నిర్వహణ కోసం వీవోఏలకు శిక్షణ ఇచ్చారు. స్వయం సహాయక గ్రూపుల్లో మహిళలు ఇప్పటి వరకు చదివిన వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. పదవ తరగతిలోపు చదివి మధ్యలో మానేసిన వారిని గుర్తించి ఓపెన్ టెన్త్‌లో చేర్పిస్తున్నారు. అదేవిధంగా పదవ తరగతి పాసై చదువు మానేసిన మహిళలను ఓపెన్ ఇంటర్‌లో చేర్పిస్తున్నారు. ఇంటర్ పూర్తి చేసిన వారిని డిగ్రీలో చేర్పించి డిగ్రీ పూర్తయిన తర్వాత సంఘం సభ్యులకు ఉపాధి కల్పించే లక్ష్యంగా పథకాన్ని కొనసాగిస్తున్నారు. సంఘంలో చదివిన వారిని వలంటీర్‌గా నియమించి నిరక్షరాస్యులకు విద్య నేర్పిస్తున్నారు.

● నిర్వహణ కోసం కమిటీ

గ్రామీణ ప్రాంతాల్లో ఉల్లాస్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కమిటీలను ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో డీఆర్‌డీవోతోపాటు విద్యాశాఖ అధికారులు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. మండలస్థాయిలో ఎంపీడీవో, ఎంఈవో, ఐకేపీ ఏపీఎం, గ్రామస్థాయిలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు, వీవోఏ అధ్యక్షురాలు, గ్రామ కార్యదర్శులకు బాధ్యతలను అప్పజెప్పారు. లక్ష్యాన్ని సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించిన ఉన్నతాధికారులు వందశాతం అక్షరాస్యత కోసం కృషి చేస్తున్నారు.

ఎస్సారెస్పీకి పెరిగిన వరద

● ప్రాజెక్టులోకి 52,765 క్యూసెక్కుల నీరు రాక



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

జగిత్యాల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం వరద నీరు భారీగా పెరిగింది. డ్యామ్‌లోకి రాత్రి 9 గంటల వరకు 52,765 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వాటర్ వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో గోదావరినీరు ప్రాజెక్టులోకి వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5టీఎంసీల సామర్థ్యానికిగాను ప్రస్తుతం 24.655 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 622క్యూసెక్కుల నీటిని వదిలారు. ఇదిలా ఉండగా జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్టులోకి 13.045 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నుంచి వివిధ అవసరాల నిమిత్తం 3.099 టీఎంసీల నీరును వ్యయం చేశారు.

ముగిసిన సీబీఎస్‌ఈ క్లస్టర్-7 కబడ్డీ పోటీలు

● అండర్-14, 19 విజేతగా శ్రీప్రకాష్ విద్యానికేతన్



చాంపియన్‌గా నిలిచిన శ్రీప్రకాష్ విద్యానికేతన్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని జగిత్యాలరోడ్ వివేకానంద రెసిడెన్షియల్‌పాఠశాలలో మూడు రోజులుగా కొనసాగిన సీబీఎస్ఈక్లస్టర్-7 బాలుర కబడ్డీపోటీలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా కబడ్డీజట్టు అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ అమిత్‌కుమార్ మాట్లాడుతూ క్రీడల్లో వస్తున్న మార్పులను గమనిస్తూ ఎప్పటికప్పుడు శిక్షణపొందాలన్నారు. లక్ష్యసాధనకు నిరంతరం కృషి చేయాలన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించే స్ఫూర్తిని కలిగి ఉండాలన్నారు. వివేకానందపాఠశాల చైర్మన్ డాక్టర్‌పొల్సాని సుధాకర్‌రావు ప్రతిష్ఠాత్మక క్రీడలకు ఆతిథ్యంఇవ్వడం గర్వంగా భావిస్తున్నామన్నారు. కబడ్డీ ఐక్యత, సమభావనను పెంపొందిస్తుందన్నారు.

విజేతలు వీరే..: అండర్-14 విభాగంలో శ్రీప్రకాష్ విద్యానికేతన్ (పాయకరావుపేట) చాంపియన్‌గా నిలిచింది. వెరిటాస్ సైనిక్ స్కూల్ (తిరుపతి) ద్వితీయ, సూర్యచంద్ర ప్యాలెస్‌స్కూల్(వనపర్తి), శ్రీ విద్యాపీఠం(నార్కట్‌పల్లి) తృతీయస్థానాల్లో నిలిచాయి. అండర్-17 విభాగంలో వెరిటాస్ సైనిక్ స్కూల్(తిరుపతి) చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకుంది. శ్రీవిద్యాపీఠం(నార్కట్‌పల్లి)ద్వితీయ, సూర్యచంద్ర ప్యాలెస్ స్కూల్(వనపర్తి), ఎస్సార్‌విద్యానికేతన్ ఇంటర్నేషనల్ స్కూల్(గద్వాల్) తృతీయస్థానాల్లో నిలిచాయి. అండర్-19విభాగంలో శ్రీప్రకాష్ విద్యానికేతన్(పాయకరావుపేట) చాంపియన్‌గా నిలవగా, సిస్టర్ నివేదిత స్కూల్(హైదరాబాద్)ద్వితీయ, వెరిటాస్‌సైనిక్ స్కూల్(తిరుపతి), హిల్స్ హైస్కూల్(నరసింగపాలెం) తృతీయస్థానాల్లో నిలిచాయి. చాంపియన్‌గా నిలిచినజట్లకు బహుమతులు ప్రదానం చేశారు. విజేతలకు ట్రోఫీలతోపాటు క్రీడల ప్రారంభం రోజున కరీంనగర్ కబడ్డీ అసోసియేషన్‌చైర్మన్ వెలిచాల రాజేందర్‌రావు ప్రకటించిన నగదు బహుమతులను అతిథులుఅందజేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాశాఖాధికారి శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్రకబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సీహెచ్ సంపత్‌రావు, అసోసియేషన్ ప్రధానకార్యదర్శి మల్లేశం, సీబీఎస్ఈ క్రీడల పరిశీలకుడు ఎల్.వెంకటరమణ, పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ టి లలితకుమారి, ప్రిన్సిపాల్ బలివాడ రేణుక, వైస్ ప్రిన్సిపాల్ ఎం.ప్రశాంత్, హెడ్ మిస్ట్రెస్ అనిత, పాఠశాల సలహాదారుడు గంధ్ర లక్ష్మణ్‌రావు, ఏవో చిత్తరంజన్ పాల్గొన్నారు.

ఇంటర్ లాకింగ్ పనులు పూర్తి

● నేటి నుంచి యథావిధిగా రైళ్ల రాకపోకలు

పెద్దపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి రైల్వే జంక్షన్ సమీపంలో నిర్మిస్తున్న బైపాస్ రైలుమార్గాన్ని అందుబాటులోకి తీసుకోచ్చేందుకు చేపట్టిన ఇంటర్ లాకింగ్ పనులు పూర్తయ్యాయి. దీంతో సోమవారం నుంచి యథావిధిగా భాగ్యనగర్, ఇంటర్ సిటీ, కాగజ్‌నగర్, సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు, సింగరేణి, రామగిరి, కరీంనగర్ నుంచి సిర్పూర్ టౌన్ పుష్‌పుల్ ఎక్స్‌ప్రెస్ రైల్, బల్లార్షా నుంచి కాజీపేట నడిచే రైలు నడవనున్నాయి. పెద్దపల్లి బైపాస్‌వద్ద నిజామాబాద్ మార్గాన్నినేరుగా కాజీపేటమార్గంతో అనుసంధానం చేయనున్నారు. అలాగేబైపాస్ క్యాబిన్‌నుసైతం ప్రారంభించబోతున్నారు. పెద్దపల్లి బైపాస్ మార్గం నుంచి కాజీపేట్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్లే గూడ్సు రైలు ఆదివారం నడిచింది. 4 రోజులుగా రైళ్ల రద్దుతో ప్రయాణికులు ఇబ్బందులుపడగా సోమవారంనుంచి రైళ్లయథావిధిగా నడవనున్నాయి.



పెద్దపల్లి జంక్షన్ వైపు వస్తున్న రైలు



మొక్కలు నాటే ముందు కొబ్బరికాయ కొడుతున్న కలెక్టర్

రాజన్న కోడెల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలి: కలెక్టర్

వేములవాడ కల్చరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): శ్రీరాజరాజేశ్వర స్వామి వారి గోశాలలోని కోడెల సంరక్షణపై ప్రత్యేకశ్రద్ధ చూపించాలని రైతులకు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సూచించారు. వేములవాడ రాజన్న ఆలయ తిప్పాపూర్ గోశాలనుంచి 85జతల కోడెలను సంబంధిత రైతులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోశాల నుంచి పంపిణీ చేసినకోడెలను కేవలం వ్యవసాయఅవసరాలకు మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేశారు. వాటిని పక్కదారి పట్టిస్తే కఠినచర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కోడెల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కోడెల స్థితిగతులపై ఆరాతీస్తారని తెలిపారు.

వనమహోత్సవంలో పాల్గొన్న కలెక్టర్..

రాష్ట్రదేవాదాయ, ధర్మదాయశాఖనేతృత్వంలో వనమహోత్సవంలో భాగంగా గోశాలఆవరణలో రోడ్డువెంట కొబ్బరిమొక్కలను కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా ఆధ్వర్యంలో నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతో దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో ఈవో రాధాబాయి, ఏఈవోలు శ్రావణ్‌కుమార్, బ్రహ్మన్నగారి శ్రీనివాస్, అశోక్‌కుమార్, సూపరింటెండెంట్లు తదితరులు ఉన్నారు.

బీడీ పరిశ్రమలపై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలను ఎత్తివేయాలి

● బీడీ కార్మికులకు రూ.4వేల పెన్షన్‌ను అమలు చేయాలి

● సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్ రమ



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్ రమ



పాల్గొన్న బీడీ కార్మికులు

సిరిసిల్ల రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నిరుపేద మహిళలు ఆధారపడి జీవిస్తున్న బీడీ పరిశ్రమలపై విధించిన ఆంక్షలను కేంద్రప్రభుత్వం ఎత్తివేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్ రమ డిమాండ్ చేశారు. సిరిసిల్లపట్టణంలో చేనేతవస్త్ర వ్యాపార సంఘ భవనంలో ఆదివారం సీఐటీయూ తెలంగాణ బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ 3వ మహాసభలు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి అధ్యక్షతన జరిగాయి. ఈ మహాసభలకు ముఖ్యఅతిథిగా సీఐటీయూ బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్రఅధ్యక్షుడు గోపాలస్వామి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్ రమ హాజరయ్యారు. ఈ సందర్భంగా రమ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 7లక్షలమంది కార్మికులు బీడీ పరిశ్రమలపై అధారపడి జీవిస్తున్నారని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బీడీ కార్మికులకు గతంలో కొనసాగిన గృహనిర్మాణ, పెన్షన్ ఇతర సంక్షేమ పథకాలను ఎత్తివేసిందన్నారు. వాటిని వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్రప్రభుత్వం ఎన్నికల సందర్భంగా బీడీ కార్మికులందరికి ఎలాంటి ఆంక్షలులేకుండా రూ.4వేల పెన్షన్ అమలు చేస్తామని హామీ ఇచ్చి రెండు సంవత్సరాలు దగ్గర పడుతున్నా అమలు చేయడం లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం వెంటనే రూ.4వేల పెన్షన్‌ను అమలు చేయాలన్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గోపాలస్వామి మాట్లాడుతూ బీడీ కార్మికులను కంపెనీ యాజమాన్యాలు అనేకరకాలుగా దోపిడీకి గురిచేస్తున్నారని అన్నారు. కనీస వేతనంలో కోతలను విధిస్తూ నాణ్యమైన ఆకు, తంబాకు వేయకుండా ఇబ్బందులకు గురిచేస్తు న్నారన్నారు. జిల్లాలోని బీడీ కార్మికులందరు ఐక్యంగా సమస్యలపై పోరాటానికి ముందుకురావాలని పిలుపునిచ్చారు.

ఈ మహాసభలో సీఐటీయూ జిల్లాకార్యదర్శి కోడం రమణ, ఉపాధ్యక్షుడు మూషం రమేష్, సహాయకార్యదర్శులు సూరంపద్మ, గురజాల శ్రీధర్, డీవైఎఫ్ఐ జిల్లాకార్యదర్శి మల్లారపు అరుణ్ కుమార్, ఐద్వా జిల్లా కార్యదర్శి విమల, సీఐటీయూ నాయకులు శ్రీరాముల రమేష్‌చంద్ర, నక్క దేవదాస్, జిందం కమలాకర్, దాసరి రూప, బెజుగం సురేష్, బోనాల లక్ష్మి, లింగంపల్లి జ్యోతి, గురజాల మమత తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కోతుల బెడద

● ఇళ్లపై వానరాల గుంపులు

● పంటలు ధ్వంసం

● వృద్ధులు, చిన్న పిల్లలపై దాడులు

మానకొండూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కోతుల బెడదతో జనం అవస్థలు పడుతున్నారు. పెద్ద సంఖ్యలో కోతులు ఇళ్లపై చేరడంతో భయాందోళన చెందుతున్నారు. చిన్న పిల్లలతో పాటు వృద్ధులపై దాడులు చేయడంతో తీవ్రంగా గాయాలపాలవుతున్నారు. మానకొం డూరు మండలంలో ప్రజలు కోతుల బెడదతో వణికి పోతున్నారు. గ్రామాలలోని గుట్టల్లో కోతులకు ఆహారం లభించకపోవడంతో ఇళ్లలోకి గుంపులు, గుంపులుగా వస్తూ ప్రజలను భయ పెడుతున్నాయి. ఇళ్లమీద చేర డమే కాకుండా ఇంట్లోకి వెళ్లి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్త న్నాయి. అడ్డుపడితే దాడికి దిగుతుండడంతో జనం ఆసుపత్రుల పాలవుతున్నారు. గ్రామాల్లో ఇళ్ల వద్ద కూరగాయలు సాగు చేస్తే మొత్తం ధ్వంసం చేస్తున్నాయి. రైతులు సాగు చేస్తున్న ఆరుతడి పంటలు వేరుశనగ, మొక్కజొన్న పంటలతో పాటు వరిని నాశనం చేస్తుండడంతో పెట్టుబడి రాకుండా పోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉదయాన్నే గ్రామాలలోకి వచ్చి గ్రామస్తులపైకి దాడికి దిగుతున్నాయి. ప్రభుత్వం స్పందించి కోతుల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

● కోతుల దాడిలో నెలకు 80 మందికి చికిత్స

మండల కేంద్రం మానకొండూర్‌తో పాటు వెల్దిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఉన్నది. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో రోజుకు ఇద్దరు చొప్పున కోతుల దాడికి గురైన వారు ఆసుపత్రికి వచ్చి చికిత్స చేసుకుంటున్నారు. గ్రామాలలో కోతులు ఎక్కువగా ఉండడమే కాకుండా దాడికి పాల్పడుతున్నాయని మందులను కూడా అందుబాటులో ఉంచి వైద్యం అందిస్తున్నట్లు మాన కొండూర్ పీహెచ్‌సీ డాక్టర్ సల్మాన్ తెలిపారు.



అన్నారంలోని ఇంటిపై ఉన్న కోతులు



లింగాపూర్-అన్నారం దారిపై అడ్డుగా ఉన్న కోతులు

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి సుమారు 40వేల వరకు భక్తులు తరలివచ్చినట్లు ఆలయాధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులు ముందుగా రాజన్న ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి, కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ఈసందర్భంగా భక్తులు ధర్మదర్శనం, శీఘ్రదర్శనం కోడె మొక్కు క్యూలైన్‌ల ద్వారా ఆలయలోకి చేరు కుని పార్వతిరాజరాజేశ్వర స్వామివారలను దర్శించుకున్నారు. అనంతరంరాజన్నకు ఎంతో ఇష్టమైన కోడెమొక్కులను చెల్లించుకుని పరివార దేవతాలయాల్లో ప్రత్యేకపూజలో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఏఈవోలు, సూపరిండెంట్లు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

ధర్మపురిలో భక్తుల ప్రత్యేక పూజలు



ధర్మపురి గోదావరి నదిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

ధర్మపురి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని గోదావరి నదిలో భక్తులు ఆదివారం పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. యమధర్మరాజు ఆలయం వద్ద గండదీపంలో నూనె పోశారు. ఉగ్రనారసింహ స్వామి ఆలయంలో భక్త మండలి సభ్యులు, ఆర్య వైశ్యులు భక్తిపాటలు పాడుతూ భజనలు చేశారు. కార్యక్రమంలో ఆలయఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కురవీందర్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, ప్రవీణ్‌కుమార్, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచార్య, నంబి నరసింహమూర్తి, అభిషేక్ పౌరోహితులు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌బాక్స్

శ్రీపురం కాలనీ కార్యవర్గం

కరీంనగర్ కల్చరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శ్రీపురం కాలనీ కార్యవర్గాన్ని ఆదివారం కాలనీ వాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా కర్నె రాజమౌళి, చావ నగేశ్వరరావు, కోశాధికారిగా లక్ష్మీ నారాయణ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో బల్మూరి రామచంద్రారావు, రేగులపాటి వామన్‌రావు, గణేశ్వరం ఆనంద్‌కుమార్, కోల అన్నారెడ్డి, చిందం శ్రీనివాస్, ముదుగంటి గంగారెడ్డి, వాన మామలై శ్రీనివాసాచార్యులు, మాదాసు రామారావు, దీపక్ ముందడా, శ్రీనివాస రావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

హుజూరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌కు చెందిన డాక్టర్ బొరగాల రాజమోహన్ మహబూబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో పదోన్నతి పొందడంతో ఆయనను ఆదివారం మాదిగ మేధావుల ఫోరం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

సుభాష్‌నగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కట్టరాంపూర్, గౌతమినగర్‌లోని ఎస్సీ, ఎస్టీ బస్తీలో మాధవ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ చక్రవర్తుల రమణాచార్యుల వైద్య బృందం ఆధ్వర్యంలో పరీక్షలు చేశారు. డాక్టర్లు సప్తఋషి, సురేష్, లిఖిత్, కనకరాజు, మాధవ సేవా సమితి అధ్యక్షుడు సీపీ నిరంజనాచారి, కార్యదర్శి కామారపు ప్రసాద్, సంయుక్త కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆండాళ్ తిరునక్షత్రం

కరీంనగర్ కల్చరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఆండాళ్‌దేవి తిరునక్షత్రాన్ని భక్తులు సోమవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోనున్నారు. రంగనాథుని వివాహం చేసుకున్న గోదాదేవి, రంగనాయకి, శూడి కొడుత్తనాచ్చియార్, ఆముక్తమాల్యదగా పిలువబడే ఆండాళ్ దేవి తిరునక్షత్రాన్ని (జన్మదినం) నిర్వహిస్తారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరెప్పుడో?

- పైలట్ గ్రామాల్లో నిర్మాణాలు - మిగతా చోట్ల ఎదురుచూపులు - కమిటీల నియామకంలో జాప్యం


బహదూర్‌ఖాన్‌పేట్‌లో నిర్మాణంలో ఉన్న ఇల్లు

కరీంనగర్ రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పైలట్ గ్రామాల్లో మినహా మిగతా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరవకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. కరీంనగర్ రూరల్ మండలంలో 17 గ్రామాలకు 9,058 దరఖాస్తులు రాగా ఇందులో 2,609మందిని అర్హులను గుర్తించారు. ఇంకా 1042 మంది అర్హులై ఉండి ఇంటి స్థలాలు లేని వారిని గుర్తించారు. బహదూరఖాన్ పేటలో 106 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు. 60 నిర్మాణం చేపట్టారు. 25 మంది ఇళ్లు నిర్మించుకోలేమని అధికారులకు రాత పూర్వకంగా తెలిపారు. అయితే అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చినా మిగతా గ్రామాల్లో ఇప్పటి వరకు ముందడుగు పడడంలేదని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు అధికార కాంగ్రెస్ నాయకుల మధ్య నెలకొన్న వర్గ విభేదాలతో ఇందిరమ్మ ఇళ్ల కమిటీల ఏర్పాటులో జాప్యమవుతోంది? రెండు వర్గాల నాయకులు వేర్వేరుగా కమిటీ సభ్యుల జాబితాను అప్పటి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఇవ్వగా ఆమోదించలేదు. ప్రస్తుత జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చొరవ తీసుకుని కమిటీలను నియమించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

రేకుల షెడ్‌లో ఉంటున్నాం

- రజిత,చెర్లబూత్కూర్

అర్హుల జాబితాలో పేరు వచ్చిందన్నారు. దీంతో పాత ఇంటిని కూల్చివేశాం. ఇప్పుడు మంజూరు రాలేదంటున్నారు. నాలుగు నెలల నుంచి ఎదురుచూస్తున్నాం. తాత్కాలికంగా రేకుల షెడ్‌ను నిర్మించుకొని ఉంటున్నాం.

గుంతలమయంగా జాతీయ రహదారి


హుజూరాబాద్‌లోని వరంగల్ రోడ్‌లో అధ్వానంగా మారిన రోడ్డు

హుజూరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలో జాతీయ రహదారి పూర్తిగా దెబ్బతింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు డిపోక్రాస్, పెద్దమోరీ, కరీంనగర్ రోడ్లు గుంతలమయమయ్యాయి. రెండేళ్లుగా నేషనల్ హైవే563 బైపాస్ పనులు జరుగుతున్నాయి. ఆ పనులు పూర్తయ్యే వరకు సదరు కాంట్రాక్టర్ ఈ గుంతలను పూడ్చాల్సి ఉంటుంది. కానీ కాంట్రాక్టర్, నేషనల్ హైవే అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనదారులు తీవ్రఅసౌకర్యానికి గురవుతున్నారు. రాత్రి వేళల్లో గుంతలు కనబడక, ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా నేషనల్ హైవే అధికా రులు స్పందించి గుంతలను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు

రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణించాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏసీపీ విజయ్‌కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా జూడో క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలని ఏసీపీ విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి జూడో, సబ్ జూనియర్, క్యాడెట్ బాలబాలికల ఎంపిక పోటీల్లో మాట్లాడారు. క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని, క్రీడల ద్వారా ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని అన్నారు. అనంతరం సబ్ ఇన్‌స్పెక్టర్ సురేష్ విజేతలకు బహుమతులు అందించారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెలలో వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన నున్నారు. జిల్లా జూడో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సాదవేని వినయ్, దామోదర్, బాధ్యులు మన్నాన్, శ్రీనివాస్, వెంకటరమణ, గోలి సుధాకర్, రవీంద్రాచారి, ఎన్ శ్రీకాంత్, ఎస్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా
ప్రైవేటు ఆస్పత్రులు

వీణవంక, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నిబంధనల ప్రకారం ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స చేయాల్సి ఉంటుంది. దీనికి భిన్నంగా గ్రామాల్లో ఆర్ఎంపీలే తెలిసీ తెలియని వైద్యం చేస్తున్నారు. మండలంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా పలువురు ఆసుపత్రులు తెరుస్తున్నారు. వైద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మెడికల్ షాపులతో పాటు ల్యాబ్‌లు ఏర్పాటు చేసుకుని చిన్నపాటి రోగాలకే టెస్టుల పేరిట డబ్బులు వసూలు చేస్తున్నారన్న విమర్శలున్నాయి. యాంటీ బయాటిక్స్‌కు విచ్చలవిడిగా ఉపయోగిస్తున్నారు. మోతాదుకు మించి మందులు ఇవ్వడంతో రోగులు సైడ్ ఎఫెక్ట్స్‌తో ఇబ్బంది పడుతున్నారు. కంపెనీలు ఇచ్చే శాంపిల్స్‌ను రోగులకు అమ్ముతున్నారు. జిల్లా వైద్యశాఖ అధికారులు, డ్రగ్స్ కంట్రోల్ అధికారులు తనిఖీలు చేపట్టి అనుపతులు లేని ఆసుపత్రులు, ల్యాబ్‌లపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

(5వ పేజీ తరువాయి)

పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేసి అడ్డుకు నేవారు. ప్రస్తుతం కట్టకింది భాగంలో, కట్టపై ఎలాంటి బారికేడ్లు లేనందున సందర్శకులు వందలాది వాహనాలతో గేట్ల సమీపంలోకి వెళ్లారు. దీంతో డ్యాంకట్టపై వాహనాల రాకపోకలతో పాటు సందర్శకులకు ఇబ్బంది తలెత్తింది. మానేరు జలాశయంలో 24 టీఎంసీ సామర్థ్యం ఉన్నప్ప టికీ ప్రస్తుతం 6 టీఎంసీల నీరు మాత్రమే ఉన్నది. డ్యాం గేట్ల సమీపంలో మాత్రమే నీరు ఉండగా మిగతా ప్రాంతమంతా ఎడారిగా మారింది. అయినప్పటికీ సందర్శకులు ఆదివారం ఒక్కసారిగా డ్యాంకట్టపై రావటంతో అక్కడ విధుల్లో ఉన్న లేక్ అవుట్‌పోస్ట్ సిబ్బంది కూడా నిలువరించలేక పోయారు. జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు పడుతుండటం, గోదావరి నది ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో మానేరు జలాశయంలోకి కూడా భారీగా నీరు వచ్చి చేరుతుందని భావించిన సందర్శకులు డ్యాంకట్టపైకి వచ్చినట్లు చెపుతున్నారు.సెలవు రోజు కావటం, సాయంత్రం వేళ చల్లటి వాతావరణం ఆహ్లాదంగా ఉండటంతో నగరవాసులు చాలా మంది కుటుంబ సభ్యులతో కలిసి కార్లలో కట్టపైకి రావటంతో సందర్శకరులతో నిండిపోయింది. డ్యాంకట్టపై రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిపి వేయటంతో ట్రాఫిక్ స్థంభించిపోయింది. గమనించిన పోలీసులు వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించి ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకున్నారు. తిమ్మాపూర్ మండలంలోని మహాత్మానగర్ శ్రీ తాపాల నృసింహస్వామి దేవాలయం సమీపం నుంచి ఎల్ఎండీ కట్టపై నుంచి కింద డ్యాం నీటి వరకు వాహనాలు, సందర్శకులతో నిండిపోయింది. నీటి ప్రవాహం ఉన్న చోట వరకు వెళ్లి కుటుంబ సమేతంగా, స్నేహితులు, బంధువులు కలిసికట్టుగా సరదాగా గడిపారు. జనం తాకి డి పెరుగడంతో పోలీసులు అక్కడికి చేరుకుని అందరినీ పంపించివేశారు.

గొర్రెల పెంపకందారుల
సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి

శంకరపట్నం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకారసంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కాల్వ సురేష్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో సంఘం సమావేశం మండలాధ్యక్షుడు కేశవేణి రవియాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ గొర్లకాపరులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. గ్రామ స్థాయి నుంచి ప్రాథమిక గొర్రెల పెంపకదారుల సహకార సంఘాలు బలోపేతం చేస్తే కొంతవరకు సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందన్నారు. శంకరపట్నం మండలంలో పూర్తిస్థాయిలో ఎన్నికలు నిర్వహించలేదని, 18 సంఘాలకు గానుసంఘాలకు మాత్రమే ఎన్నికలు నిర్వహించారన్నారు. మిగితాసంఘాలకు ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొంరయ్య, తిరుపతి, సంపత్, జైపాల్, కొంరయ్య, తిరుపతి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ మాస పూజలు


హవనం నిర్వహిస్తున్న అర్చకులు

కరీంనగర్ కల్చరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జడ్పీ క్వార్టర్స్ ఆవరణలోని వేంకటేశ్వర, అయ్యప్ప, శివ, ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం శ్రావణ మాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ నాయిని సుప్రియ, ఆలయ చైర్మన్ అనిల్‌కుమార్‌గౌడ్, ఈవో కాంతారెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్ ఈ-టెక్నోలో పేరెంట్స్ డే


పేరెంట్స్‌డే వేడుకలను ప్రారంభిస్తున్న డాక్టర్ వనజా రెడ్డి

భగత్‌నగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో పేరెంట్స్ డే వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి సతీమణి డాక్టర్ వనజా రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రుల మాటలను అనుసరించిన వారికి విజయం చేకూరుతుందని, వారు జీవితంలో అత్యుత్తమ స్థానంలో స్థిరపడతారని అన్నారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై మరో కేసు

హుజూరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదైనట్లు టౌన్ సీఐ కరుణాకర్ ఆదివారం తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు మేకల తిరుపతి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డిపై 352,353(1) (బీ), 352(2) బీఎన్ఎస్ సెక్షన్ కింద కేసు నమోదు చేశామన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి వారసుడికి గురుపూజ

కరీంనగర్ కల్చరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నగరానికి వచ్చిన కందిమల్లయ్యపల్లె బ్రహ్మంగారి మఠానికి చెందిన వీర బ్రహ్మేంద్రస్వామి 8వ తరం వారసుడు వీరభద్రస్వామి సన్మానించారు. ఆదివారం కమాన్‌రోడ్ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గురుపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆలయ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం భక్తులకు ఆశీస్సులు అందజేశారు.

నగరంలోని కళాభారతిలో ఆదివారం పవన్‌కుమార్ ప్రొడ్యూసర్, యాక్టర్‌గా నిర్మించిన బ్రహ్మంగారి గాన సుధపాటను బ్రహ్మంగారి 8వ తరం వారసుడు వీర భద్రస్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు కళాకారులు, నటులు, నగర వాసులు పాల్గొన్నారు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


శిబిరాన్ని పరిశీలిస్తున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్ రైజ్ హాస్పిటల్స్ సౌజన్యంతో ముకరంపురలోని వాణినికేతన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి స్పందన లభించింది. 500 మంది పైగా ప్రజలు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారని నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ పరీక్షలు బయట చేయించుకోవాలంటే దాదాపు పది లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని, మూడు లక్షల రూపాయల విలువైన మందులు ఉచితంగా అందజేశామని తెలిపారు. ఈ సందర్భంగా సన్‌రైజ్ హాస్పిటల్ యాజ మాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కె.కిరణ్ కుమార్, జనరల్ ఫిజీషియన్‌లు డాక్టర్ జె.సురేష్, సీహెచ్ కార్తీక్, న్యూరో సర్జన్ డాక్టర్ కె.శివకుమార్, ఆర్థోపెడిక్ డాక్టర్ కె.రవికాంత్, గైనకాలజిస్ట్ డాక్టర్ నయని, మార్కెటింగ్ హెడ్ కె.ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు తదిరతులు పాల్గొన్నారు.

అర్చకులపై
అనుచిత వ్యాఖ్యలు తగదు

చొప్పదండి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అర్చక సంక్షేమం ధ్యేయంగా పనిచేసే గంగుఉపేంద్రశర్మపై అనుచితవ్యాఖ్యలు తగదని అర్చకఉద్యోగ వెల్ఫేర్‌బోర్డు సభ్యుడు జక్కాపురం నారాయణస్వామి అన్నారు. ఆదివారం ఆయన మాట్లా డుతూ రాష్ట్ర అర్చకసమాఖ్య వ్యవస్థాపకుడు గంగు ఉపేంద్రశర్మపై టి వేంకటాద్రి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిం చారు. కార్యక్రమంలో జిల్లా దూపదీప నైవేద్య సంఘం అధ్య క్షుడు నాగరాజు సంపత్ కుమారాచార్యులు, సెలక్షన్ కమిటీ సభ్యుడు సింహాచలం మురళీధరస్వామి, మండల అధ్యక్షు డు బైరి కృష్ణమూర్తి స్వామి, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలకు విరాళం

వీణవంక, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్సై ఆవుల తిరుపతికి సోలార్ సీసీ కెమెరాలకు యాభై వేల రూపాయల విరాళాన్ని బీఆర్ఎస్ నాయకులు ఆదివానం అందజేశారు. వారిలో మాడ సాధవరెడ్డి, మావురపు విజయభాస్కర్‌రెడ్డి, రాయిశెట్టి శ్రీనివాస్, ముసిపట్ల తిరుపతి రెడ్డి ఉన్నారు. శాంతి భద్రతల పర్యవేక్షణకు సీసీ కెమెరాలు ఉపయోగపడుతాయన్నారు.

సోషల్ మీడియాలో పోస్ట్‌లపై పోలీసులకు ఫిర్యాదు

కరీంనగర్ క్రైం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మాజీ మేయర్, బీజేపీ నాయకుడు సునీల్‌రావుపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టులు పెట్టినవారిపై చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ నాయకులు ఆదివారం టూటౌన్ సీఐ కె.సృజన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. వారం రోజులుగా మాజీ మేయర్ వై.సునీల్‌రావుపై కొందరు సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడుతున్నారని, ఒక ఛానెల్ లోగోతో తప్పుడు వార్తలు సృష్టించారని పేర్కొన్నారు. వివిధ డివిజన్‌లకు చెందిన బీజేపీ నాయకులు నాగరాజు, రాజప్రభాకర్, అనిల్, హమీద్, మల్లేశం తదితరులు ఉన్నారు.

ప్రజాప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్ల కల సాకారం

ఇల్లందకుంట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్ల కల సాధ్యవుతోందని కాంగ్రెస్ శ్రేణులు అన్నాయి. ఆదివారం మండలంలోని మల్లివానిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు వారు ముగ్గు పోశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇల్లందకుంట మండల వ్యాప్తంగా 252 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయన్నారు. మంజూరైన లబ్ధిదారులందరూ సంతోషంగా ఇళ్లు నిర్మించుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో సారంగపాణి, రాజిరెడ్డి, వీరారెడ్డి, రాంరెడ్డి, సంపత్, కిరణ్, తిరుపతిరెడ్డి, జలేందర్‌రెడ్డి, వీరన్న, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ ఎల్ఐసీ బ్రాంచ్ లియాపి అధ్యక్షుడిగా సంపత్‌రావు

హుజూరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఎల్ఐసీ బ్రాంచ్ లియాపి అధ్యక్షుడిగా మోకిరాల సంపత్ రావు ఎన్నికయ్యారు. ఆదివారం హుజూరాబాద్ పట్టణంలోని మధువని గార్డెన్‌లో ఎల్ఐసీ ఏజెంట్ల ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా మోకిరాల సంపత్‌రావు, ప్రధానకార్యదర్శిగా మునిగాల సమ్మారావ్, కోశాధికారిగా గంట సంపత్‌రావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎల్ఐసీ ఏజెంట్లు స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు.

బీఆర్ఎస్ స్థానిక ఎన్నికల ఇన్‌చార్జిల నియామకం

రామడుగు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల సందర్భంగా రామడుగు మండల బీఆర్ఎస్ ఇంచార్జిలను మాజీఎమ్మెల్యే సుంకె రవిశంకర్ నియ మించారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. మండల ఇన్‌చార్జిగా వీర్ల వెంకటేశ్వర్‌రావు, గట్ల జితేందర్‌రెడ్డి, మార్కొండ కిష్టారెడ్డి, జూపాక కరుణాకర్, గంట్ల వెంకట్ రెడ్డి, చాడ శేఖర్‌రెడ్డి, టి మురళి, మామిడి తిరుపతి, వి వెంకట్ రమణారెడ్డి, నాగిశేఖర్, దాసరి రాజేందర్‌రెడ్డి, జూపాక మునీందర్‌ను నియమించారు.

ఎమ్మెస్సార్ సతీమణికి నివాళి

కరీంనగర్ అర్బన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి ఎమ్మెస్సార్ సతీమణి మేన్నేని సుగుణమ్మ ద్వాదశ దినకర్మ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో మానకొండూర్, చొప్పదండి ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం నివాళులర్పించారు. ఆమె మనుమడు టీపీసీసీ అధికార ప్రతినిధి మేన్నేని రోహిత్‌రావును పరామర్శించారు. టీపీసీసీ ప్రధానకార్యదర్శి రుద్ర సంతోష్, మాజీ మేయర్ సునీల్‌రావు, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

మొక్కలు నాటిన హమ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు

సుభాష్‌నగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 30వ డివిజన్ వరాహస్వామి ఆలయ పరిసర ప్రాంతాల్లో హరితహారంలో భాగంగా హమ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు ధనపురి సాగర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, ప్రతీ ఒక్కరు తమవంతుగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ట్రెజరీ తొడుపునూరి తిరుపతి, సభ్యులు అనిల్ కుమార్, మునిగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

టీఎన్‌జీఓస్ జిల్లా అధ్యక్షుడిని కలిసిన నాయకులు

సుభాష్‌నగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డిని నీటిపారుదలశాఖ జూనియర్ సహాయకుడు, టీఎన్‌జీఓస్ పెద్దపల్లి జిల్లా సంయుక్త కార్యదర్శి సర్దార్ హర్వీందర్‌సింగ్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసిశారు. ఇటీవల కరీంనగర్ గురుద్వారా అధ్యక్షుడిగా హర్మిందర్ సింగ్, ప్రధాన కార్యదర్శిగా ఏస్పాల్‌సింగ్ ఎన్నికవగా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సర్దార్ హర్మీందర్‌సింగ్, దీపక్‌సింగ్ తదితరలు పాల్గొన్నారు.

నల్గొండ గద్దర్‌కు సన్మానం


సన్మానిస్తున్న వెలిచాల రాజేందర్‌రావు

కరీంనగర్ అర్బన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నల్గొండ గద్దర్, తెలంగాణ ఉద్యమ గాయకుడు నర్సన్నను కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు సన్మానించారు. ఆదివారం హైదరాబాద్‌లోని రాజేందర్‌రావు నివాసానికి నర్సన్న వచ్చారు. ఈ సందర్భంగా యువత గంజాయికి దూరంగా ఉండాలని పాడిన పాటను గుర్తుచేస్తూ ప్రత్యేకంగా అభినందించారు.

ప్రజల పక్షాన పోరాడే వారికి అండగా ఉండాలి

హుజూరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రజల పక్షాన పోరాడే వారికి ప్రజలు అండగా ఉండాలని వీక్షణం ఎడిటర్ ఎన్ వేణుగోపాల్ అన్నారు. ఆదివారం హుజూరాబాద్ పట్టణంలోని వీఎల్ఆర్ కన్వెన్షన్‌లో పట్టణానికి చెందిన ఆవునూరి సమ్మయ్య రచించిన జ్ఞాపకాల ఊరేగింపు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రజా పోరాటాల్లో అసువులు బాసిన అమరులను ఎప్పటికప్పుడు స్మరించుకోవాలన్నారు. ఉద్యమాల్లో పాల్గొన్న వారి చరిత్రను ప్రతి ఒక్కరూ రచించాలన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసులను అణిచివేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఆదివాసు ప్రజలను, మావోయిస్టులను హత్య చేయించిందన్నారు. సమ్మయ్య రచించిన పుస్తకం సమాజానికి మేలు కోల్పే పుస్తకమన్నారు. సమ్మయ్య సమాజం పట్ల, ఉద్యమాల పట్ల అవగాహన ఉన్న వ్యక్తి అన్నారు. అనంతరం ఆవునూరి సమ్మయ్యను సన్మానించారు. కార్యక్రమంలో ముక్కెర రాజు, డాక్టర్ ఎస్ తిరుపతయ్య, పుప్పాల శ్రీరాం, కె అంజయ్య, విప్లవ దత్తు శుక్లా, హుస్సేన్, రత్నం, ఈశ్వర్‌రెడ్డి, సదానందం, వెంకట్రాజం తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వేణుగోపాల్

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంకండి


శ్రీరాములపల్లెలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి

ఇల్లందకుంట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని శ్రీరాములపల్లెలో ప్రధాని మన్‌కీబాత్ కార్యక్ర మాన్ని స్థానిక బూత్‌కార్యకర్తలతో కలిసి ఆయన వీక్షించారు. అనంతరం కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజలంతా బీజేపీ వైపు చూస్తున్నారని, జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ ప్రభంజనం సృష్టిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి, ఆకుల రాజేందర్, తూర్పాటి రాజు, తదితరులు పాల్గొన్నారు.

వీణవంక: మండల కేంద్రంలో బీజేపీ ముఖ్య కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటాలని పేర్కొ న్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలులో విఫలం చెందిదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుప్పాల రఘు, నరేష్, సంపత్‌రావు, నర్సింహ రాజు తదితరులు పాల్గొన్నారు.

మన్‌కీబాత్ వీక్షించిన నాయకులు

కరీంనగర్ టౌన్: నగరంలోని 63వ డివిజన్‌లో 163వ పోలింగ్ బూత్ అధ్యక్షులు పబ్బా ఆంజనేయులు ఆధ్వర్యంలో ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు వీక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్యాలయం ఇన్‌చార్జి రాగి సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు రెడెడ్డి శ్రీనివాస్, నాయకులు దయ్యాల కరుణాకర్, వొల్లెం సంజీవ్‌కుమార్, దయ్యాల అశోక్ కుమార్, కర్రె రాజమల్లయ్య, పరకాల ఆంజనేయులు, పబ్బల సత్యం, నాయకులు పాల్గొన్నారు.

వర్షాలకు కూలిన ఇల్లు


మొలంగూర్‌లో కూలిపోయిన ఇల్లు

శంకరపట్నం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామంలో కురిసిన వర్షాలకు ఇంటిపై కప్పుతోపాటు గోడ కూలిపోయాయి. మూడు రోజులుగా మండలంలో కురిసిన భారీవర్షాలకు గ్రామానికి చెందిన జంపాల పోచయ్యా-రాధమ్మ ఇల్లు శనివారం అర్ధరాత్రి కూలినట్లు బాధితులు తెలిపారు. నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.